batukammanews.com
TEL/2019/78873

# బతుకమ్మ

తాజా వార్తల సద్దిమూట

20 అక్టోబర్ 2026
మంగళవారం

### సెయింట్ లూయిస్‌లో

## బతుకమ్మ సంబరాలు

అమెరికాలోని సెయింట్ లూయిస్ సిటీ పట్టణంలో బ్రోమిన్ సిక్ పార్క్ లో తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ గ్రేట్ సెంట్లు ఇస ఆధ్వర్యంలో తెలంగాణ పూల పండగ ఘనంగా బతుకమ్మ సంబరాలు జరిపారు.

– వెబ్ డెస్క్, బతుకమ్మ



2 లో

# తెలంగాణ యూనివర్శిటీకి

# 2 అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టులా ?

- రాష్ట్రంలో 422 అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టుల భర్తీ
- కావాల్సింది 80కి పైగా పోస్టులు
- కోర్టు కేసుల పేరుతో పోస్టుల భర్తీకి మోకాళ్లడ్డు
- ఖాళీలున్న భర్తీకి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేదెవరు




2 లో

ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ పేరు మీద ఏర్పడిన తెలంగాణ యూనివర్సిటీలో టీచింగ్ ఫ్యాకల్టీ భర్తీలో తీవ్ర అన్యాయం జరిగింది. రాష్ట్రంలో ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీకి తెలంగాణ ఉన్నత విద్యమండలి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్రంలో 422 అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీకి నోటిఫికేషన్ జారీ అయింది. అందులో ఘనత వహించిన తెలంగాణ విశ్వవిద్యాలయానికి కేవలం రెండంటే 2 అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టులను భర్తీకి అవకాశం ఇచ్చారు. అందులో ఉస్మానియా యూనివర్సటీకి 252, కాకతీయ యూనివర్సిటీకి 49, శాతవాహనకు 49, పాలమూరు యూనివర్సటీకి 45, అంబేద్కర్ యూనివర్సిటీకి 16, సురవరం ప్రతాప్ రెడ్డి తెలుగు విశ్వవిద్యాలయానికి 16 పోస్టుల భర్తీకి అనుమతి లభించింది.

– నిజామాబాద్, బతుకమ్మ

### ఎన్ఐ యూఎమ్ నూతన ప్రాంగణంకు

## శంకుస్థాపన చేసిన సీఎం



2 లో

భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్మించనున్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్ నూతన ప్రాంగణానికి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. రూ. 200 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న ఈ ప్రాంగణం కోసం ప్రభుత్వం ఫ్యూచర్ సిటీలో 20 ఎకరాల భూమి కేటాయించింది. 2009లో జవహర్‌లాల్ నెహ్రూ జాతీయ పట్టణ పునరుద్ధరణ మిషన్ కింద ఎంపికైనప్పటికీ ఎన్ఐయూఎంకు రాష్ట్ర ప్రభుత్వం భూమి కేటాయించని కారణంగా ఇంతకాలం వాయిదా పడుతూ వచ్చింది. తాజాగా ప్రభుత్వం ఫ్యూచర్ సిటీలో 20 ఎకరాలు కేటాయించింది. తెలంగాణలో పట్టణ విధానాల రూపకల్పనకు, కార్యాచరణ ఆధారిత పరిశోధన సంస్థగా ఎన్ఐయూఎం కీలకంగా పనిచేస్తుంది. 2028 జూన్ 2 నాటికి ప్రాంగణ నిర్మాణాన్ని పూర్తి చేసి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం రోజున ప్రారంభించుకోవాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

– హైదరాబాద్, బతుకమ్మ

## ఓట్ బచావో దేశ్ బచావో పరిశీలకుడిగా జుక్కల్ ఎమ్మెల్యే



జుక్కల్, బతుకమ్మ : జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావుకు ఏఐసీసీ వరుసగా పార్టీ పరమైన కీలక బాధ్యతలను అప్పగిస్తోంది. కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఓట్ బచావో దేశ్ బచావో కార్యక్రమంలో భాగంగా తాజాగా తమిళనాడు లోని ఏడు జిల్లాలకు పరిశీలకుడిగా ఆయనను నియమించింది.

2 లో

### కాఫర్ డ్యాం నిర్మించి

## ప్రాణహిత నీటిని మళ్లించాలి

- నవంబర్ నెలాఖరులోగా కాఫర్ ? డ్యాం నిర్మించుకుంటే కన్నేపల్లి పంపు హౌస్ వద్ద ఆందోళన చేస్తాం
- మేడిగడ్డను బూచీగా చూపి రైతులకు నష్టం చేయవద్దు
- కన్నేపల్లి పంప్ హౌజ్‌ను పరిశీలించిన టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత




2 లో

### జిల్లా ప్రజలకు ప్రముఖుల

## విజయదశమి శుభాకాంక్షలు

నిజామాబాద్ , బతుకమ్మ :విజయ దశమి వేడుకను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. చెడుపై మంచి సాధించిన విజయానికి సంకేతంగా జరుపుకునే విజయదశమి వేడుకను ఇంటిల్లిపాది ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు.





2 లో

# తెలంగాణ యూనివర్సిటీకి 2 అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టులా?

తెలంగాణ విశ్వవిద్యాలయానికి రెండే అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయనుండడం చర్చనీయాంశంగా మారింది. 2006లో ఉమ్మడి రాష్ట్రంలో ప్రారంభమైన తెలంగాణ విశ్వవిద్యాలయం ప్రస్తుతం డిచ్ పల్లి మండలంలో 577 ఎకరాల్లో 26 కోర్సులతో న్యాక్ గ్రేడ్ బి హోదా కలిగి ఉంది. 13 మంది పీహెచ్ డి కలిగిన ప్రొఫెసర్లు ఉండగా 81 మంది రెగ్యులర్ అధ్యాపకులు ఉన్నారు. 52 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు, మిగిలిన వారు ట్యూటర్లుగా కొనసాగు తున్నారు. దాదాపు 80 పోస్టుల భర్తీకి తెలంగాణ యూనివర్సిటీలో అవకాశం ఉంది. దాదాపు 3 వేల మంది విద్యార్థులు అభ్యసిస్తున్న యూనివ ర్సిటీలో రెగ్యులర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం అవకాశం ఇచ్చిన ప్పుడు కేవలం రెండే పోస్టులను భర్తీకి అనుమతి లభించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తెలంగాణ విశ్వవిద్యాలయానికి పాలకమండలితో పాటు అధికా రులు పోస్టుల భర్తీ విషయంలో ఖాళీలను చూపిం చడంలో విఫలమయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతు న్నాయి. ప్రధానంగా కోర్టు కేసు నేపంతో పోస్టుల భర్తీని పెద్దగా పట్టించుకోలేదన్న వాదనలున్నాయి. కోర్టు కేసులను వెకేట్ చేయించడంలో పాలకమండలితో పాటు అధికారులు చొరవ చూపలేదని, దానిని ఉన్నత విద్యమండలిపై తోసివేసి పట్టించుకోలేదన్న విమర్శలు లేకపోలేదు. తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలో రాజకీయ ఉద్దండులకు కొదవ లేదు. పాలకమం డలిలోనూ కీలకమైన పదవులు ఉన్న వారు కూడా లేకపోలేదు. నిజామాబాద్ జిల్లాలో ముగ్గురు ప్రభుత్వ సలహాదారులు, రాష్ట్ర పీసీసీ చీఫ్ తో పాటు ఏడుగురు ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎమ్మెల్సీలు, ఇద్దరు ఎంపీలున్నా విశ్వవిద్యాలయంలో టీచింగ్ ఫ్యాకల్టీ భర్తీలో చొరవ తీసుకోకపోవడంపై పలు వాదనలు వినిపిస్తున్నాయి. యూనివర్సిటీ అధికారులు, పాలకమండలి సభ్యులు విశ్వవిద్యాలయంలో అవసరమైన అధ్యాపకుల విషయంలో అందరినీ కలుపుకుని ప్రభుత్వానికి కావాల్సిన ఖాళీల జాబితాను ఇవ్వలేదనేదే ప్రధాన ఆరోపణ. ముఖ్యంగా యూనివర్సిటీలో రాజకీయాలకు వేదికగా మారిందని వాదనలున్నాయి. ఇది వరకు పని చేసిన కొందరు యూనివర్సిటీ అధికారులు అవినీతితో విశ్వవిద్యాలయానికి తీరని మచ్చతెచ్చారు. అంతేగాకుండా యూనివర్సిటీలో టీచింగ్ స్టాఫ్ మధ్య కుల రాజకీయాలకు కొదవలేదు. ఈ నేపథ్యంలోనే ఎన్నో ఏళ్ళకు అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టుల భర్తీకి అవకాశం ఉన్నప్పటికీ కేవలం రెండే పోస్టులను భర్తీకి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ ఇప్పటి వరకు యూనివర్సిటీ అధికారులు, పాలకమండలి, ఇక్కడి పాలకులు స్పందించకపోవడంపై విద్యార్థి లోకం గుర్రుగా ఉంది.

## జిల్లా ప్రజలకు ప్రముఖుల విజయదశమి శుభాకాంక్షలు

దసరా పండుగ అందరి జీవితాల్లో విజయాలు సమకూర్చాలని, చేపట్టిన ప్రతీ కార్యం విజయవంతం కావాలని అభిలషించారు. విజయ దశమి వేళ అన్ని వర్గాల వారు సుభిక్షంగా,సుఖ సంతోషాలతో జీవనాలు వెళ్లదీయాలని ఆకాంక్షించారు.

## ఓట్ బచావో దేశ్ బచావో పరిశీలకుడిగా జుక్కల్ ఎమ్మెల్యే

విద్యావంతుడిగా, విజ్ఞానవంతుడిగా, రాజకీయ చతురత కలిగిన నేతగా గుర్తింపు పొందిన తోట లక్ష్మీకాంతారావుకు ఐదు భాషలపై పట్టు ఉంది. గతంలో పార్టీ అప్పగించిన బాధ్యతలను విజయవంతంగా నిర్వహించడంతో మరోసారి ఆయనకు కీలక అవకాశం దక్కింది. ఇంతకుముందు సంగారెడ్డి డీసీసీ అధ్యక్షుల నియామకంతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లోనూ పార్టీ తరఫున వివిధ సందర్భాల్లో ఆయనను పరిశీలకుడిగా ఏఐసీసీ నియమించింది. తనపై విశ్వాసంతో కేంద్ర, రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వం మరోసారి బాధ్యతలు అప్పగించడం పట్ల తోట లక్ష్మీకాంతారావు కృతజ్ఞతలు తెలిపారు. తాజా బాధ్యతలను కూడా విజయవంతంగా నిర్వహిస్తానని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# సెయింట్ లూయిస్‌లో బతుకమ్మ సంబరాలు

తెలంగాణ రాష్ట్ర తెలుగు మహిళ సోదరిమణులు ఉత్సాహంగా పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కొందరు అమెరికా మహిళలు చీర కొంగు కట్టుకొని పాల్గొంటారు. ప్రకృతి అందాల సోయగాల మధ్య తెలంగాణ పూల పండుగ తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ గ్రేట్ సెయింట్ లూయిస్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు జరిపి బహుమతులు , భోజనాలు ఏర్పాటు చేశారు.



### ఎన్ఐ యూఎమ్ నూతన ప్రాంగణంకు శంకుస్థాపన చేసిన సీఎం

అంతకుముందు ముఖ్యమంత్రి యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ భవనాల నిర్మాణాలు, పరిసర ప్రాంతాన్ని పరిదశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.



# మౌలిక సదుపాయాలు కల్పించాలి

## ప్రజావాణిలో చిన్నతడుగూరు గ్రామస్థుల వినతి

మద్నూర్, బతుకమ్మ :కామారెడ్డి జిల్లా మద్నూర్ మండల పరిధిలోని చిన్నతడుగూరు (ఖరగ్) గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ గ్రామస్థులు మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అధికారులకు ఫిర్యాదు సమర్పించారు. గ్రామంలో దీర్ఘకాలంగా వేధిస్తున్న సమస్యలను పరిష్కరించాలని వారు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.
నూతన గ్రామ పంచాయతీ భవనం: గ్రామ ప్రజల పరిపాలనా అవసరాల కోసం, సత్వర సేవల కోసం నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని నిర్మించాలి.
అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం: చిన్నారులకు, గర్భిణులకు మెరుగైన సేవలు అందించేందుకు అంగన్‌వాడీ కేంద్రానికి ప్రత్యేక భవనాన్ని ఏర్పాటు చేయాలి.
ప్రభుత్వ పాఠశాలకు ఉపాధ్యాయుడి నియామకం: స్థానిక ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదని, తక్షణమే అవసరమైన ఉపాధ్యాయుడిని నియమించి విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలని కోరారు.గ్రామంలో విద్యా, పరిపాలనా సదుపాయాలను మెరుగుపరిచేందుకు సంబంధిత ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరపాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. తక్షణమే నిధులు మంజూరు చేసి భవన నిర్మాణ పనులు చేపట్టాలని, ఉపాధ్యాయుల కొరతను తీర్చాలని కోరారు.ఈ ప్రజా సమస్యల పరిష్కారం కోసం గ్రామస్థులతో కలిసి బండివార్ హనుమాన్లు ప్రజావాణిలో ఫిర్యాదు సమర్పించిన వారిలో ఉన్నారు. అధికారులు సానుకూలంగా స్పందించి తమ సమస్యలను పరిష్కరిస్తారని గ్రామ ప్రజలు ఆశాభావం వ్యక్తం చేశారు.



# కాఫర్ డ్యాం నిర్మించి ప్రాణహిత నీటిని మళ్లించాలి







భూపాలపల్లి, బతుకమ్మ : రాష్ట్రంలో కరువు పరిస్థితులను ఎదుర్కొని రైతులకు మేలు చేయాలంటే వెంటనే కన్నెపల్లి పంప్ హౌస్ వద్ద 93 మీటర్ల ఎత్తులో కాఫర్ డ్యామ్ నిర్మించి ప్రాణహిత నీళ్లను మళ్లించాలని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ప్రభుత్వానికి సూచించారు. కేవలం రూ. 25 కోట్లు ఖర్చు చేస్తే నెలన్నర రోజుల్లో ఈ డ్యామ్ ను పూర్తి చేయవచ్చన్నారు. సోమవారం కన్నెపల్లి పంప్ హౌస్ ను టీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి ఆమె సందర్శించారు. అక్కడ నీటి ప్రవాహాన్ని పరిశీలించిన తర్వాత పవర్ పాయింట్ ప్రజేంటేషన్ ద్వారా కాఫర్ డ్యామ్ నిర్మాణం ఎక్కడ చేపట్టవచ్చోని, దాని ద్వారా ఎలాంటి ప్రయోజనం ఉంటుందో వివరించారు. రాష్ట్రంలో ఎంతటి కరువు పరిస్థితులున్న సరే ప్రాణిహిత నదిలో రోజుకు రెండు టీఎంసీల నీళ్లు ప్రవాహిస్తుంటాయన్నారు. ఆ నీటిని సరిగా వాడుకుంటే చాలని చెప్పారు. నవంబర్ లోగా కాఫర్ డ్యామ్ నిర్మించాలని రైతుల తరఫున ప్రభుత్వానికి వినమ్రంగా విజ్ఞప్తి చేస్తున్నామని..వినకపోతే ప్రభుత్వం మెడలు ఎలా వంచాలో తమకు తెలుసని అన్నారు. మేడిగడ్డ బూచిని చూపి రైతులకు నష్టం చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. కరువు కోరల్లో చిక్కుకున్న రాష్ట్రాన్ని గట్టెక్కించేందుకు తాము ఎంతో అధ్యయనం చేసి నిపుణులతో మాట్లాడి కాఫర్ డ్యామ్ నిర్మాణమే సొల్యూషన్ అని గుర్తించామన్నారు. ఇందుకు సంబంధించిన టెక్నికల్ డీయిటెల్స్ ను కూడా ప్రభుత్వానికి ఇస్తామన్నారు. తామిచ్చిన సూచనను నిపుణులతో మాట్లాడి ప్రభుత్వం పరిశీలించాలని..ఈ విషయంలో ఏదైనా మార్పులు ఉన్నా సరే తాము అంగీకరిస్తామన్నారు. ఎట్టి పరిస్థితుల్లో రైతులకు నష్టం జరగకూడదనేది తమ తాప్రయతమని చెప్పారు. వెంటనే ప్రభుత్వం ఈ పనులను చేపట్టి కరువు కోరల్లోంచి బయటపడే ప్రయత్నం చేయాలన్నారు.

. . . ప్రశ్నించటమే కాదు పరిష్కారం చూపిస్తాం

ప్రభుత్వాన్ని ప్రశ్నించటమే కాకుండా పోరాటం చేస్తూ పరిష్కారానికి కూడా తామే మార్గం చెబుతామని కవిత అన్నారు. ఇతర పార్టీల మాదిరిగా రెండు రోజులు హడావుడి చేసి టీవీల్లో కనిపించటం తమ ఉద్దేశం కాదని చెప్పారు. కరువు నుంచి బయటపడాలంటే ఏం చేయాలన్న దానిపై నిపుణులతో మాట్లాడిన తర్వాతే కాఫర్ డ్యామ్ అనే ఆలోచన చేశామన్నారు. అదే విధంగా రాష్ట్రంలో నవంబర్ వరకు రైతులకు నీళ్లు, కరెంట్ ఎట్టి పరిస్థితుల్లో ఇవ్వాల్సిందేనని చెప్పారు. కరువు పరిస్థితులను ముందే గ్రహించి కొన్ని రోజుల క్రితమే రైతులకు నవంబర్ వరకు ఉచిత కరెంట్ ఇవ్వాలని తామే డిమాండ్ చేశామని గుర్తు చేశారు. తాము కోరిన తర్వాతే ముఖ్యమంత్రి ఈ అంశంపై స్పందించి కేంద్రాన్ని కరెంట్ అడుగుతామని చెప్పారన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం కోటి 10 లక్షల ఎకరాల పంటకు నీళ్లు, కరెంట్ అవసరం ఉందని చెప్పారు. నవంబర్ చివరి వరకు కరెంట్, నీళ్లు ఇచ్చి రైతుల పంటలను కాపాడాలని కోరారు. ప్రతిపక్షాలంటే ఓ వైపు ప్రభుత్వంపై పోరాటం చేస్తూనే సమస్య పరిష్కారానికి సొల్యూషన్ కూడా చెప్పాలన్నారు. ప్రశ్నించు, పోరాడు, పరిష్కరించు అనే నినాదంతో ఆ పనిని తమ పార్టీ చేస్తుందని చెప్పారు. కరెంట్, నీళ్లు ఇచ్చే పరిస్థితి ఉన్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని..ఈ విషయాన్ని రాష్ట్రంలోని ప్రతి రైతుకు తెలిసేలా చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

### తెలంగాణ వచ్చాక కూడా నీళ్ల విషయంలో న్యాయం జరగలే

తెలంగాణ రాష్ట్రం వచ్చి 13 ఏళ్లు గడుస్తున్నప్పటికీ కూడా మనం మన వాటా నీళ్లను సంపూర్ణంగా వాడుకోలేని దుస్థితిలో ఉన్నామని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. మా నీళ్లు మాకేనంటూ పిడికిలెత్తి తెలంగాణ ఉద్యమం చేసిందే నీళ్ల కోసమని గుర్తు చేశారు. కానీ తెలంగాణ వచ్చాక కూడా మన నీళ్లను మనం వాడుకోలేకపోతున్నామన్నారు. నిజానికి మనకున్న రెండు పెద్ద నదులైన గోదావరి??కృష్ణా నీళ్లను సరిగా వాడుకుంటే రాష్ట్రంలో కరువు అనే పరిస్తితే ఉండదని చెప్పారు. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం లక్షా 80 వేల కోట్లు ఖర్చు చేసి కృష్ణా నది పరివాహంలో 4 నుంచి 5 లక్షలు??గోదావరి లో లక్ష ఎకరాలకు మాత్రమే కొత్తగా నీళ్లు ఇచ్చిందని చెప్పారు. కాళేశ్వరం కోసం 93 వేల కోట్లు ఖర్చు చేసినప్పటికీ పాత ఆయకట్టు స్థిరీకరణ, వరద ప్రవాహం కోసం మాత్రమే వాటిని ఖర్చు చేశారన్నారు. కాళేశ్వరం కాలువలను పూర్తి చేయాలంటే మరో 50 వేల కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఆ పరిస్థితి ఉంటే కాంగ్రెస్ వచ్చాక పరిస్థితి మరింత దిగజారిందన్నారు. రూ. 26 వేల కోట్లు ఖర్చు చేసి తట్టెడు మట్టి కూడా ఎత్తలేదని ధ్వజమెత్తారు. అడిగితే పాత బకాయిలు చెల్లించామని చెబుతున్నారని, ఫీజు రీయింబర్స్ మెంట్, దళిత బంధు లాంటి బకాయిలు ఎందుకు చెల్లించటం లేదని ప్రశ్నించారు. మేడిగడ్డ బూచి చూపించి రైతులకు అన్యాయం చేయవద్దని..వెంటనే కాఫర్ డ్యామ్ పనులు చేపట్టాలని కోరారు. అదే విధంగా మేడిగడ్డ బ్యారేజ్ పనులను పూర్తి చేసేందుకు కూడా ఇదే మంచి సమయమని వెంటనే ఆ పనులను కూడా పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో 21 వేల చెరువులు ఎండిపోయి రైతులు, ముదిరాజ్ లు, బెస్త సోదరులు బాధలో ఉన్నారని చెప్పారు. వచ్చే పది నెలలు ఇంకా భయంకరమైన పరిస్థితులుంటాయని..వాటి నుంచి బయటపడేందుకు తామిచ్చిన సూచనను ప్రభుత్వం సీరియస్ గా పరిశీలించాలన్నారు.

. . . చిన్న కాళేశ్వరం పూర్తి చేయాలి

మంథని నియోజకవర్గంలో చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్ ను వెంటనే పూర్తి చేయాలని కవిత డిమాండ్ చేశారు. మంత్రి శ్రీధర్ బాబు ఇక్కడ ప్రజలకు చిన్న మాటను నిలబెట్టుకోవాలని కోరారు. అదే విధంగా ముంపు బాధితులకు సరైన పరిహారం కల్పించాలన్నారు. పదేళ్లు ప్రతిపక్షం ఉన్న సమయంలో ప్రజలకు మాటిచ్చిన శ్రీధర్ బాబు అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడిచిన ఎందుకు మాట నిలబెట్టుకోవటం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి బోడ జనార్దన్, పార్టీ సీనియర్ నాయకులు రియాజ్ అహ్మద్, ఇస్మాయిల్, నవీన్ కుమార్, రవిచంద్ర, వెంకట్, నరేశ్ నేత తదితరులు పాల్గొన్నారు.

# కేజీకేఎస్ 69వ వార్షికోత్సవాల సందర్భంగా జెండా ఆవిష్కరణ

## ఇజీ కేఎస్ జిల్లా అధ్యక్షులు కోయేడి నర్సింహులు.

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : నిజామాబాద్ పట్టణంలోని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యాలయ ఆవరణలో 69వ వార్షికోత్సవాల సందర్భంగాజిల్లా అధ్యక్షులు కోయేడి నర్సింహులు జెండా ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన జిల్లా అధ్యక్షులు కోయేడి నర్సింహులు జిల్లా గౌరవ అధ్యక్షులు పెద్ది వెంకట రాంలు మాట్లాడుతూ గీత కార్మికులు, గౌడులు రాజకీయాలకతీతంగా కల్లుగీత కార్మిక సంఘం నిర్వహించే పోరాటాలలో భాగస్వాములు కావాలి ఇప్పటివరకు గీత కార్మికులు సాధించుకున్న హక్కులన్నీ పోరాటాల ఫలితమే ఎంతో మంది అమరవీరులు కల్లుగీత ఉద్యమంలో వారి జీవితాలు త్యాగం చేసి గీతా కార్మికుల హక్కుల కోసం నిలబడ్డారు. ముఖ్యంగా వేలంపాటల రద్దు, మైపూజ్ విధానం నౌకరినామ రద్దు చేయాలని సొసైటీలు ఏర్పాటు చేయాలని తాటి ఈత చెట్లపై గీతా కార్మికులకు హక్కు ఉండాలని సాధించి పెట్టారని అన్నారు. అంతేకాకుండా ఎక్స్గ్రేషియో పెన్షన్ తాటి చెట్ల పెంపకానికి భూమి లాంటి సంక్షేమ పథకాలకు అనేక పోరాటాలు నిర్వహించి సాధించడం జరిగింది. వీటితోపాటు గీతా కార్మికులపై భారాలు వేసినప్పుడు బారాలకు వ్యతిరేకంగా ఏ ప్రభుత్వం




అధికారంలో ఉన్న కల్లుగీత కార్మికుల్ని ఐక్యం చేసి రాష్ట్రంలో పోరాటాలు నిర్వహించి హక్కులు సాధించిన చరిత్ర కేజీ కేఎస్ సొంతం అని వివరించారు. మనమందరం భవిష్యత్ వృత్తి ఆధునికరణ సంక్షేమం గీత కార్మికుల సామాజిక ఆర్థిక అభివృద్ధికి పాటుపడాలి కాంగ్రెస్ ప్రభుత్వం గీతా కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేసేంతవరకు రాజకీయాలకు అతీతంగా గీతా కార్మికుల్ని సమీకరించి భవిష్యత్తు ఉద్యమాలు నిర్మిస్తామని ఆ పోరాటాలలో మనమందరం భాగస్వాములం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రామాగౌడ్, అంజయ్య, చిడుగు శేఖర్ గౌడ్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# టీజీపీఎస్సీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

## జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి






నిజామాబాద్ అర్బన్ , బతుకమ్మ : తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో ఈ నెల 24, 26వ తేదీలలో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీ.బీ.టీ) విధానంలో జరుగనున్న పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. కాలుష్య నియంత్రణ మండలిలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ సైంటిస్టు (అనలిస్ట్), అసిస్టెంట్ ఎన్విరాన్మెంటల్ పోస్టుల భర్తీ కోసం టీజీపీఎస్సీ ద్వారా ఈ నెల 24, 26 తేదీలలో పరీక్షలు నిర్వహించనున్న నేపథ్యంలో కమిషన్ చైర్మన్ బుర్రా వెంకటేశం సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత జిల్లాల కలెక్టర్లు, పోలీసు అధికారులతో సమీక్ష జరిపారు. పరీక్షల నిర్వహణ కోసం చేపట్టిన ఏర్పాట్ల గురించి వివరాలు అడిగి తెలుసుకుని, పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని అర్సపల్లిలో గల ఏ.వీ ఎంటర్ ప్రైజెస్ సెంటర్ లో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. 24న అసిస్టెంట్ సైంటిస్టు పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఉదయం 10 గంటల నుండి మధ్యాన్నం 12.30 గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 2.30 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు సెకండ్ సెషన్ పరీక్షలు జరుగుతాయని అన్నారు. 26వ తేదీన కూడా అవే సమయాలలో అసిస్టెంట్ ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్ లలో పరీక్షలు జరుగుతాయని వివరించారు. జిల్లాలో 24వ తేదీ నాటి పరీక్షకు 90 మంది అభ్యర్థులు, 26వ తేదీ నాటి పరీక్షకు 190 మంది హాజరు కానున్నారని తెలిపారు. కాపీయింగ్, లీకేజీలకు ఆస్కారం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామని అన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ లను నియమించామని, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు అనుక్షణం నిశిత పర్యవేక్షణ జరుపుతాయని కలెక్టర్ స్పష్టం చేశారు. బయో మెట్రిక్ విధానం ద్వారా వేలిముద్రల సేకరణ ప్రక్రియ చేపట్టాల్సి ఉన్నందున అభ్యర్థులు నిర్ణీత సమయానికి ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ సూచించారు. ఉదయం పరీక్షకు సంబంధించి ఉదయం 8 గంటల నుండే పరీక్షా కేంద్రం లోనికి వెళ్లేందుకు అనుమతించడం జరుగుతుందని, 9.30 గంటలకు గేట్లు మూసివేస్తారని, నిమిషం ఆలస్యం అయినా అనుమతించబడరని తెలిపారు. మధ్యాహ్నం సెకండ్ సెషన్ పరీక్షకు సంబంధించి 12.30 గంటల నుండి లోనికి అనుమతించడం జరుగుతుందని, 2.00 గంటలకు గేట్లు మూసివేస్తారని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రం లోనికి మొబైల్ ఫోన్, పుస్తకాలు, ఎలక్ట్రానిక్ ఉపకరణాలు వంటివి తీసుకువెళ్లేందుకు అనుమతి లేదని, ఈ మేరకు ప్రతి కేంద్రం వద్ద క్షుణ్ణంగా తనిఖీలు చేయాలని ఆదేశించామన్నారు. పరీక్షా సమయం ప్రారంభం నుండి ముగిసేంత వరకు పరీక్ష కేంద్రం నుండి అభ్యర్థులతో పాటు ఇన్విజిలేటర్లు కూడా బయటకు వెళ్లకూడదని తెలిపారు. కాగా, పరీక్షా కేంద్రంలో పరీక్షల నిర్వహణ విధుల్లో పాల్గొంటున్న అధికారులు, సిబ్బందికి సంబంధించిన బంధువులు ఎవరూ పరీక్ష రాయడం లేదని వారి నుండి ధృవీకరణ పత్రం తీసుకోవాలని కేంద్రం నిర్వాహకులను ఆదేశించారు. ఏ చిన్నపాటి అవాంతరం, గందరగోళానికి తావు లేకుండా సాఫీగా పరీక్షలు జరిగేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అన్నారు. పరీక్ష కొనసాగే సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా చూడాలని ట్రాన్స్కో ఎస్.ఈ ని ఆదేశించారు. సమయానుకూలంగా రవాణా వసతి అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. అదేవిధంగా పరీక్షా కేంద్రంలో వైద్య బృందాన్ని ఏర్పాటు చేయాలని, తాగునీరు, టాయిలెట్లు తదితర అన్ని సదుపాయాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. 24మంది అభ్యర్థులకు ఒకరు చొప్పున ఇన్విజిలేటర్లను నియమించాలని, చీఫ్ సూపరింటెండెంట్ మినహా ఎవరు కూడా పరీక్షా కేంద్రం లోనికి సెల్ ఫోన్ తీసుకువెళ్లకూడదని స్పష్టం చేశారు. అధికారులు పరస్పర సమన్వయంతో వ్యవహరిస్తూ, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షలను ప్రశాంత వాతావరణంలో జరిగేలా పక్కాగా విధులు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ రాజాగౌడ్, ట్రైనీ కలెక్టర్ సురేష్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మా స్థలాన్ని తొలగిస్తానంటున్నారు

## మాపై కక్ష్య సాధింపులకు పాల్పడుతున్నారు

## మాకు న్యాయం చేయండి..

## లేదంటే ఆత్మహత్యే శరణ్యం






రుద్రూర్, బతుకమ్మ : మా స్థలాన్ని తొలగిస్తామని ప్రజాప్రతినిధి, కొంత మంది గ్రామస్తులు మాపై కక్ష్య సాధింపులకు పాల్పడుతున్నారని, మాకు న్యాయం చేయాలని . . . లేదంటే ఆత్మహత్యే శరణ్యమని బాధితులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. రుద్రూర్ మండలం అక్బనగర్ గ్రామానికి చెందిన కాజ రోహిత్, కనక మెడల శ్రీలక్ష్మి, కాజా ఝాన్సీలకు సంబంధించిన స్థలం (స్థిరస్తి)ని ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా, ఇందులో నుండి దారి ఉందని, మా స్థలాన్ని తొలగించాలని చూస్తున్నారని బాధితులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ మా స్థలానికి సంబంధించిన అన్ని ధ్రువపత్రాలు ఉన్నాయని, ఈ ధృవపత్రాలు చెల్లవు అంటూ ప్రజాప్రతినిధి, పంచాయతీ సిబ్బంది, కొంతమంది గ్రామస్తులను పోగుచేసి మాపై కక్ష్య సాధింపులకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. సోమవారం గ్రామపంచాయతీ సిబ్బంది మా స్థలాన్ని తొలగించడానికి గడ్డపారలు తీసుకు వచ్చారని అన్నారు. మేము చెప్పిందే చట్టం, మేము చెప్పిందే న్యాయం అంటూ మమ్మల్ని తీవ్ర భయభ్రాంతులకు, మానసికక్షోభకు గురి చేస్తున్నారని బాధితులు వాపోయారు. మీరు లీగల్ గా ప్రొసిడింగ్ అవ్వమని చెప్పిన కూడా వినకుండా మాపై కక్ష్య కట్టారని పేర్కొన్నారు. ఈ విషయం పై ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాస్ కు వినతి పత్రం అందజేశామన్నారు. మా స్థలం విషయంలో ఎలాంటి తప్పిదాలు లేవని, మా దగ్గర అన్ని ధ్రువపత్రాలు ఉన్నాయని, మేము ఏదైనా ఉంటే కోర్టు ద్వారా వెళ్తామని,మాకు న్యాయం చేయాలని, లేదంటే ఆత్మ హత్య శరణ్యమని బాధితులు పేర్కొన్నారు.



# గ్రామ పంచాయతీ సిబ్బందికి దుస్తులు, నిత్యావసర వస్తువులు పంపిణీ



నందిపేట్, బతుకమ్మ : నందిపేట్ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ సిబ్బందికి దుస్తులు, నిత్యావసర వస్తువులు, చెప్పు లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నందిపేట్ సర్పంచ్ ఎర్రం లింగం,ఉపసర్పంచ్ రామ్ చందర్,వార్డు సభ్యులు,గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా నందిపేట్ సర్పంచ్ ఎర్రం లింగం మాట్లాడుతూ గ్రామ పంచాయతీ సిబ్బంది తమ తమ వార్డుల్లో పారిశుద్ధ్య నిర్వాహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించా లని గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. అలాగే నీటిని వృథా చేయకుండా అవసరం లేని సమయంలో నల్లాలను మూసివేయాలని సూచించారు.గ్రామంలో పరిశుభ్రతను కాపాడటం, నీటి వృథాను అరికట్టడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు.

# అనాధ వృద్ధులకు బట్టల పంపిణి



డిచ్ పల్లి, బతుకమ్మ : దసరా పండుగ సందర్భంగా డిచ్ పల్లి మండలం లోని ప్రభుత్వ వృద్ధాశ్రమం లో అనాథలైన వృద్ధులకు రెడ్ క్రాస్ సొసైటీ మాజీ చైర్మన్ బస్సా ఆంజనేయులు కుటుంబ సభ్యులు నూతన వస్త్రాలను పంపిణి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణలో గొప్పగా జరుపుకునే దసరా పండుగకు ప్రతీ ఇంటిలో ప్రతీ ఒక్కరు కొత్త బట్టలు కొనుక్కొని ధరించడం ఆనవాయితీ. అందుకే మాకు ఎవ్వరూ లేరు అనేది అనాథ వృద్ధుల్లో ఆలోచన రావద్దని, మీ కోసం కూడా మేమున్నామని తెలుపుతూవాళ్ళను ఆదరించి ఆశీర్వాదం పొందాలని ఈ కార్యక్రమం చేపట్టామని పెద్దలని ఆదారిద్దాం అని తెలియజేసారు. ముఖ్యంగా యువత ఇటువంటి కార్యక్రమాలు చేపట్టాలని పెద్దలను గౌరవించాలని కోరారు .

# రావణ దహన ఏర్పాట్లను పరిశీలించిన పోచారం భాస్కర్ రెడ్డి

## ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలి



బాన్సువాడ, బతుకమ్మ : విజయదశమి సందర్భంగా ఈ నెల 20న బాన్సువాడ పట్టణంలోని ప్రొఫెసర్ జయశంకర్ మినీ స్టేడియంలో నిర్వహించనున్న దసరా వేడుకలు, రావణ దహన కార్యక్రమ ఏర్పాట్లను ఉమ్మడి నిజామాబాద్ జిల్లా డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ విఠల్ రెడ్డి, పట్టణ సీఐ తుల శ్రీధర్ తో కలిసి ఏర్పాట్లను సమీక్షించారు. వేడుకలకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎలినినో ప్రకృతి వైపరీత్యం నుండి ప్రజలను కాపాడాలి

## మహాహోమం పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మల్యాల గోవర్ధన్.



నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : నిజామాబాద్ నగరంలోని 14వ డివిజన్ భగత్ సింగ్ కాలనీలో చైతన్య యువజన సంఘం దుర్గాదేవి నవరాత్రి ఉత్సవ కమిటీ ఆహ్వానం మేరకు నిజామాబాద్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కుటుంబ సమేతంగా కార్యక్రమంలో పాల్గొన్నారు. దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని మహా హోమం కార్యక్రమాన్ని నిర్వహించి, అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించారు. అనంతరం దుర్గా దేవి మాలధారణ స్వాములకు అన్న ప్రసాదం కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతి వైపరీత్యాలను ఎలినినో ప్రభావాన్ని, తొలగించి, ప్రజలు సుఖశాంతులతో ఉండే విధంగా చూడాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో చైతన్య యువజన సంఘం నాయకులు నవీన్,అనిల్, సంజు, రాము తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణికి 48 ఫిర్యాదులు



నిజామాబాద్ అర్బన్ , బతుకమ్మ : ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు రాజాగౌడ్, భుజంగరావు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 48 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్లతో పాటు ట్రైనీ కలెక్టర్ సురేష్, డీఆర్డీఓ సాయన్న, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీపీఓ శ్రీనివాస్ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# గుండూర్ శివారులో చిరుత సంచారం



జుక్కల్, బతుకమ్మ : కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలంలో చిరుతపులి సంచారం మరోసారి కలకలం రేపింది. గుండూర్ గ్రామ శివారులో మహారాష్ట్రలోని సోమూర్‌కు వెళ్లే మార్గంలో ఆదివారం రాత్రి వాహనదారులు, స్థానికులకు చిరుత కనిపించింది. చిరుత సంచరిస్తున్న దృశ్యాలను కొందరు వీడియోలు, ఫొటోలు తీయగా అవి సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. దీంతో సమీప గ్రామాల రైతులు, ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. పది నెలలుగా కొనసాగుతున్న సంచారంగుండూర్ గ్రామానికి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో చిరుత కనిపించడంతో గ్రామస్తులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. అధికారులు చిరుత సంచరిస్తున్న ప్రాంతాలను పరిశీలించినట్లు గ్రామస్తులు తెలిపారు. గత పది నెలలుగా జుక్కల్ ప్రాంతంలోని బంగారుపల్లి, దోస్‌పల్లి, మైబాపూర్, గుండూర్, బస్వాపూర్, పెద్ద ఎడ్గి, డోన్‌గాం తదితర గ్రామాల శివార్లలో చిరుత సంచరిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. గతంలో మేకలు, గేదెలు, ఆవుదూడలు, కుక్కలపై దాడులు జరిగినట్లు పేర్కొంటున్నారు. చిరుత సంచారం నేపథ్యంలో రైతులు, గ్రామస్తులు పొలాలకు వెళ్లే సమయంలో అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు సూచించారు. చిరుత కనిపించినా, దాని ఆనవాళ్లు గుర్తించినా వెంటనే అధికారులకు సమాచారం అందించాలని కోరారు. మరోవైపు, చిరుత సంచారంతో తమకు, పశువులకు ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# ఇండియా-ఇజ్రాయెల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పదవికి నీరడి ప్రకాశ్ నామినేషన్

## తెలుగువారి సంక్షేమం, భద్రతే ప్రధాన లక్ష్యంగా అసోసియేషన్ ఇజ్రాయిల్ లో ఎన్నికలు





వేల్పూర్, బతుకమ్మ :బతుకుదెరువుకై ఇజ్రాయిల్ దేశం వెళ్లి అక్కడ పని చేస్తున్న మనోళ్ల సంక్షేమం, భద్రత కోసం ఏర్పాటైన ఇండియా బిఇజ్రాయిల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పదవికి నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన నీరడి ప్రకాశ్ నామినేషన్ దఖాలు చేశారు. ఇజ్రాయెల్‌లో నివసిస్తున్న భారతీయులు, ముఖ్యంగా తెలంగాణకు చెందిన తెలుగు ప్రజల సంక్షేమం, భద్రత, సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఆయన ఈ పదవికి పోటీ చేస్తున్నట్లు ఆయన బతుకమ్మకు వెల్లడించారు. కాగా ప్రకాశ్ నామినేషన్‌కు ఇజ్రాయెల్‌లో నివసిస్తున్న అంక్సాపూర్ గ్రామానికి చెందిన మిత్రబృంద సభ్యులు కమ్మరి ప్రకాష్, సుంకరి నరేష్, బాల రాజేశ్వర్, సుంకరి రాజు, గొర్రె రాము, తిట్ల పుణ్యం దాస్, రిక్కా వంశీ, పురిటి నవీన్, తింగరి ప్రశాంత్, తడకల గంగామోహన్, పుట్టినవీన్ తదితరులు మద్దతు ప్రకటించి నామినేషన్‌ను బలపరిచారు. ఈ సందర్భంగా నీరడి ప్రకాశ్ మాట్లాడుతూ, ఇజ్రాయెల్‌లో నివసిస్తున్న తెలంగాణ ప్రజల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ముఖ్యంగా అక్కడి తెలుగు ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానన్నారు. ఉద్యోగ విధి నిర్వహణలో ఎదురయ్యే ఇబ్బందులు, ఇతర సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో బాధితులకు అండగా నిలవడం, అవసరమైన సహాయ సహకారాలు అందించడం, కొత్తగా ఇజ్రాయెల్‌కు వెళ్లే తెలుగు వారికి అవసరమైన సమాచారం, మార్గదర్శకత్వం కల్పించడం, పరస్పర సహకారంతో ఐకమత్యాన్ని పెంపొందించడం తన ప్రధాన లక్ష్యాలని వివరించారు. తెలంగాణ ప్రజలు ఎక్కడ ఉన్న వారి సంక్షేమం, గౌరవం, భద్రతకు ప్రాధాన్యతనిస్తూ అసోసియేషన్ ద్వారా సేవలందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. నీరడి ప్రకాశ్‌కు అంక్సాపూర్ మిత్రబృంద సభ్యులు మద్దతుగా నిలవడంతో పాటు, ఇతర తెలుగు ప్రజలతోనూ సంప్రదింపులు జరుపుతూ ఆయన ప్రతిపాదించిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళున్నారు. ఇజ్రాయెల్‌లో నివసిస్తున్న తెలంగాణ ప్రజల సమస్యల పరిష్కారానికి సమష్టిగా కృషి చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు మిత్రబృంద సభ్యులు తెలిపారు.

# గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి



వేల్పూర్, బతుకమ్మ మండలంలోని రామన్నపేట గ్రామంలో సోమవారం ఓ ఉపాధి కూలీ గుండెపోటుతో మృతి చెందిన ఘటన చోటుచేసుకొంది. స్థానిక ఉపాధి కూలీలు తెలిపిన వివరాల మేరకు సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. గడ్డం భగవాన్ దాస్ (52) అనే వ్యక్తి రోజు వారిగా ఉపాధికూలికి వెళ్లే క్రమంలో ఉదయం 7 గంటలకే పనికి వెళ్ళాడు. గ్రామంలోని మల్లె చెరువులో ఫిష్ పాండ్ పనులు నడుస్తుండగా అక్కడ పని చేసే క్రమంలో తనకు తింపినట్లు, తిరిగినట్లు అవుతుందని అక్కడ ఉన్న కూలీలకు చెప్పి అక్కడే పడిపోయాడు. విషయాన్నీ ఫీల్డ్ అసిస్టెంట్ కు తెలపగా వెంటనే అంబులెన్సు తెప్పించి ఆర్మూర్ ఆసుపత్రికి తరలించారు. భగవాన్ దాస్ ను పరీక్షించిన డాక్టర్ అప్పటికే ఆయన మరణించడాని ధ్రువీకరించినట్లు ఫీల్డ్ అసిస్టెంట్ గణేష్ తెలిపారు. విషయాన్నీ తెల్సుకొన్న సర్పంచ్ నవీన్ సంఘటన స్థలానికి వెళ్లారు.

## గ్రామపంచాయతీ సిబ్బందికి

# బట్టల పంపిణీ కార్యక్రమం




నందిపేట్ బతుకమ్మ:దసరా పండుగను పురస్కరించుకొని తల్వేద గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామపంచాయతీ సిబ్బందికి బట్టలు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ సిబ్బందికి దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి సేవలను అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ హరిత శ్రీకాంత్, పాలక వర్గం పంచాయతీ కార్యదర్శి, గ్రామ పాలనా అధికారి మరియు గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## దేవాలయాలు కుల సంఘాలు

# సనాతన ధర్మ మూలస్తంబాలు



నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : యువతలో ధర్మం పట్ల ప్రేరణ కలిగించే కరపత్రాలు, పోస్టర్లను దేవాలయాలు, కుల సంఘాలు కలిసి సనాతన ధర్మ ప్రచారం, చైతన్య కలిగించాలని శ్రీశ్రీశ్రీ సద్గురు దామం ఇప్పకాయల హరిదాసుస్వామి అన్నారు. వంజరి సంఘం ఆధ్వర్యంలో సిర్నాపల్లి గడి సార్వజనిక్ దేవీనవరాత్రుల సమితిలో నగర మేయర్ ఉమారాణి చేతుల మీదుగా ఆవిష్కరించారు. శ్రీ లక్ష్మీగణపతి ఆలయంలో అరుణ్ శర్మ, డా.వినయ్ భాస్కర్, వంజరి సంఘం ఆధ్వర్యంలో దేవీరోడ్డులోని దేవీ మందిరంలో కరపత్రాలు, పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అరుణ్ శర్మ మాట్లాడుతూ దుర్గామండపాలు హిందూ యువతలో ధర్మ ప్రేరణ కలిగించే ధర్మప్రవచనాలన్నారు. శారీరక వికాసం కోసం శౌర్యశిక్షణ, లవ్ జీహద్ ను అంతం చేసే సనాతన ధర్మప్రతిజ్ఞ., నగరంలోని ఆలయాలు, కుల సంఘాలు దుర్గా, గణపతి నవరాత్రులలో మండప నిర్వాహకులకు ధర్మ ప్రేరణ కలిగించే అంశాలను అవగాహన కల్పించి సనాతన ధర్మాన్ని, హిందూ యువతను బలోతం చేయడానికి కృషి చేయాలని దేవీమాతను ప్రార్థించారు.

## ఎం. పి నిధులతో

# ఐమాక్స్ లైట్ ఏర్పాటు





వేల్పూర్, బతుకమ్మ :మండలంలోని రామన్నపేట్ గ్రామంలో ఎం. పి నిధులతో ఐమాక్స్ లైట్ ను ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ నవీన్ తెలిపారు. ఈ మేరకు గ్రామ నడి ఊరిలో గల హనుమాన్ మందిర్ వద్ద ఈ ఇమాక్స్ లైట్ ను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. సోమవారం ఆ ఐమాక్స్ లైట్ ను ఆయన కొబ్బరికాయ కొట్టి, స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐమాక్స్ లైట్ ఏర్పాటు నిధులు కేటాయించిన ఎం. పి ధర్మపురి అరవింద్ కు సర్పంచ్ గ్రామ పంచాయతీ తరపున, గ్రామ ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# వైభవంగా కొనసాగిన దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు

## చివరి రోజు మహిషాసుర మర్దిని అవతారంలో అమ్మవారికి పూజలు

## భక్తులతో కిటకిటలాడిన దేవి మంటపాలు

భీమ్ గల్, బతుకమ్మ :జై భవాని.. జై దుర్గామాతా.. అంటూ భక్తుల జయజయధ్వానాల మధ్య భీంమ్ గల్ పట్టణం తో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో దేవి మంటపాలు చివరి రోజైన సోమవారం భక్తుల సందడితో కిటకిటలాడాయి. గత తొమ్మిది రోజులుగా దేవి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా పట్టణంలోని అయ్యప్ప నగర్‌లో దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజు సోమవారం అమ్మవారు మహిషాసుర మర్దిని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజల్లో భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు.

దుష్టశిక్షణ.. శిష్టరక్షణకు ప్రతీక వేదాలు చెబుతున్న మహిషాసుర మర్దిని అమ్మవారి రూపంలో ప్రత్యేక పూజలను భక్తులు నిర్వహించారు.

మహిషాసుర మర్దిని అవతారంలో దర్శనమిచ్చిన అమ్మవారు..

భక్తులతో కిటకిటలాడిన అయ్యప్ప నగర్

దుష్టశిక్షణ.. శిష్టరక్షణకు ప్రతీక మహిషాసుర మర్దిని

మహిషాసురుడనే రాక్షసుడి ఆగడాలను అంతం చేసి లోకానికి శాంతిని ప్రసాదించిన ఆదిపరాశక్తి మహిషాసుర మర్దిని రూపం అత్యంత మహిమాన్వితమైనదని పురాణాలు తెలియజేస్తున్నాయి. దేవతలందరి శక్తుల సమాహారంగా అవతరించిన దుర్గాదేవి దుష్టశక్తులను సంహరించి ధర్మాన్ని నిలబెట్టినట్లు భక్తులు విశ్వసిస్తారు. చెడుపై మంచి సాధించిన విజయానికి, అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి ఈ అవతారం ప్రతీకగా నిలుస్తుంది. మహిషాసుర మర్దిని ఆరాధన కేవలం ఆచారానికే పరిమితం కాకుండా ప్రతి ఒక్కరిలో ఆత్మపరిశీలనకు మార్గం చూపుతుందని, మనలోని కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యం వంటి అరిషడ్వర్గాలను విడిచిపెట్టి, అసూయ, ద్వేషం, అహంకారం వంటి చెడు భావాలను దూరం చేసుకోవాలని అమ్మవారిని ప్రార్థించాలని . సత్యం, ధర్మం, దయ, ప్రేమ, సహనం, సేవాభావం వంటి సద్గుణాలను అలవర్చుకోవడం ద్వారా అమ్మవారి అనుగ్రహానికి పాత్రులం కావచ్చని ఆధ్యాత్మిక పెద్దలు సూచిస్తున్నారు. తొమ్మిదో రోజు సందర్భంగా ఉదయం అమ్మవారికి మహాభిషేకం నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం భక్తుల జయజయధ్వానాలు, భజనలు, ఆధ్యాత్మిక వాతావరణం నడుమ అమ్మవారికి తొట్లే సేవ నిర్వహించారు. గత తొమ్మిది రోజులుగా నిర్వహిస్తున్న ఉత్సవాల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొంటూ అమ్మవారికి కుంకుమార్చనలు, దీపారాధనలు సమర్పించి తమ భక్తిని చాటుకుంటున్నారు. పట్టణంలోని అయ్యప్ప నగర్‌తో పాటు శ్రీరామ్ నగర్, రాజారామ్ నగర్, విఘ్నేశ్వర కాలనీ ప్రాంతాల్లోనూ మండలంలోని జగిర్యాల్, బడా భీమ్ గల్, ముచ్కూర్, బాబాపూర్, పురానిపేట్, పల్లికొండ, పిప్రి, బచన్ పల్లి తదితర గ్రామాల్లో నవరాత్రి వేడుకల సందడి ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. చివరి రోజున అమ్మవారి మంటపల వద్ద శ్రీచండి యాగాలను నిర్వహించి, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించి, పూర్ణహుతి, బలిప్రధానం చేసి అమ్మవారి విగ్రహాన్ని కదిలించి దేవి నవరాత్రి ఉత్సవాలకు ఉద్వాసన పలికారు. సాయంకాలం మహర్నావమిని పురస్కరించుకొని అర్చకులు వాహన పూజలను నిర్వహించారు.





# చెడుపై మంచి సాధించిన విజయమే విజయదశమి వేడుక

## జిల్లా ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన

## మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి



వేల్పూర్, బతుకమ్మ :చెడుపై మంచి సాధించిన విజయానికి, ధర్మం అధర్మంపై గెలిచిన విజయానికి ప్రతీకగా విజయదశమి పండుగ వేడుకలను జరుపుకుంటామని ఆయన మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు . సోమవారం ఎమ్మెల్యే ఇంటి దైవం ముప్కాల్ మండలంలోని కొత్తపల్లి గ్రామంలో వెలసిన శివాలయంలో మహర్ణవమిని పురస్కరించుకొని తన కుటుంబ సమేతంగా లింగాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిల్లా ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వేముల మాట్లాడుతూ విజయ దశిమి ప్రతి ఒక్కరిలో నూతన ఉత్సాహాన్ని, సానుకూల ఆలోచనలను నింపాలని ఆకాంక్షించారు. విజయదశమి పండుగ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ చెడును విడనాడి, మంచిని ఆచరిస్తూ సమాజ శ్రేయస్సు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజల మధ్య ప్రేమాభిమానాలు, ఐక్యత, సోదరభావం మరింత బలపడాలని ఆకాంక్షించారు. ఈ పండుగ పర్వదినాన జిల్లా ప్రజలందరికీ అన్ని రంగాల్లో విజయం చేకూరాలని, ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు వెల్లివిరియాలని, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు సిద్ధించాలని ఆయన కోరారు . ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య విజయదశమి పండుగను జరుపుకోవాలని కోరుకుంటూ జిల్లా ప్రజలకు మరోసారి విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు.



# గంజాయి అక్రమ రవాణా కేసులో ఇద్దరి అరెస్ట్

## 4.368 కిలోల గంజాయి స్వాధీనం




నిజామాబాద్ క్రైం, బతుకమ్మ : గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు నిజామాబాద్ 1వ టౌన్ ఎస్ హెచ్ వో బూక శ్రీనివాస్ తెలిపారు. సోమవారం పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్ హెచ్ వో మాట్లాడుతూ ఆదివారం రాత్రి రైల్వేస్టేషన్ వద్ద తనిఖీలు చేపడుతుండగా పోలీసులను చూసి పారిపోయేందుకు యత్నించిన నిజామాబాద్ రూరల్ మండలం మల్కాపూర్ తాండకు చెందిన సలావత్ శ్రీనివాస్ ను అదుపులోకి తీసుకున్నామన్నారు. అతన్ని వద్ద తనిఖీ చేయగా 4.368 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సలావత్ శ్రీనివాస్ ను విచారించగా ఒడిశాకు చెందిన పరిమల్ హర్దాల్ వద్ద గంజాయి కొనుగోలు చేసి నాందేడ్‌కు చెందిన వాహిద్ ఖాన్ పాషాకు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. అలాగే గంజాయి అక్రమ వ్యాపారంలో ఆటోనగర్ కు చెందిన ఇబ్రహీం ఖాన్, కామారెడ్డి జిల్లా గాంధారికి చెందిన సునావత్ మోహన్ ప్రోత్సహించినట్లు విచారణలో వెల్లడైందన్నారు. ఈ కేసులో ఇబ్రహీం ఖాన్‌ను సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించడం జరిగిందన్నారు. ఈ కేసులో మిగిలిన నిందితుల పాత్రపై దర్యాప్తు కొనసాగుతోందన్నారు.

## టీజీఎన్‌పీడీసీఎల్ పరిధిలో

# 1.6 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్

### మౌలాలి తాండ కోస్లీ వద్ద అనుసంధానం



బోధన్, బతుకమ్మ : నిజామాబాద్ జిల్లా బోధన్ డివిజన్‌లోని రెంజల్ సెక్షన్ పరిధిలో మౌలాలి తండా?కోస్లీ సమీపంలో ఏర్పాటు చేసిన 1.6 మెగావాట్ల సామర్థ్యం గల పీఎం-కుసుమ్-ఏ సౌర విద్యుత్ ప్లాంట్‌ను సోమవారం ఎస్ఈ పి.వి.రాజేశ్వర్ రావు 33/11 కేవీ తాడ్‌బిలోలి సబ్‌స్టేషన్‌కు అనుసంధానించి సాంకేతికంగా ఛార్జింగ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ పీఎం-కుసుమ్-ఏ పథకం ద్వారా రైతులు సౌర విద్యుత్ ఉత్పత్తి రంగంలో భాగస్వాములవుతూ పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధికి తోడ్పడుతున్నారు. ఇటువంటి ప్లాంట్ల ఏర్పాటు ద్వారా స్వచ్ఛమైన ఇంధన ఉత్పత్తికి ప్రోత్సాహం లభించడంతో పాటు రైతులకు అదనపు ఆదాయ అవకాశాలు అందుబాటులోకి వస్తాయన్నారు. టెక్నికల్, ఎంఆర్‌టీ అండ్ కన్‌స్ట్రక్షన్ విభాగాల డీఈలు, బోధన్ ఆపరేషన్ డీఈఈ, ఎడపల్లి ఆపరేషన్ ఏడీఈ, నిజామాబాద్ హెచ్‌టీ మీటర్స్ ఏడీఈ, ఎడపల్లి ఆపరేషన్ ఏఈతో పాటు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు. సౌర విద్యుత్ ప్లాంట్ రైతు శివప్రసాద్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# చెడు మార్గం వెళ్ళకుండ యువత విద్యా, క్రీడాల్లో రాణించాలి

## సర్పంచ్ లకావత్ శేఖర్



భీమ్‌గల్, బతుకమ్మ :యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ విద్యా,క్రీడల్లో రాణించి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని సర్పంచ్ లకావత్ శేఖర్ సూచించారు. దసరా పండుగను పురస్కరించుకుని భీమ్‌గల్ మండలంలోని దేవన్‌పల్లి గ్రామంలో సర్పంచ్ తన ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్‌లో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ లకావత్ శేఖర్ మాట్లాడుతూ, యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంతో పాటు వారిని సన్మార్గంలో నడిపించాలనే ఉద్దేశంతో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించినట్లు తెలిపారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఐకమత్యం, పట్టుదల, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. యువత తమలోని ప్రతిభను గుర్తించి క్రీడారంగంలో నైపుణ్యాన్ని ప్రదర్శించాలని, విద్యకు సమాన ప్రాధాన్యతనిస్తూ లక్ష్యాలను సాధించాలని సూచించారు. చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. దసరా పండుగ సందర్భంగా నిర్వహించిన ఈ టోర్నమెంట్‌లో గ్రామ యువకులు ఉత్సాహంగా పాల్గొని తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. పోటీల్లో హను మాన్ యూత్ జట్టు విజయం సాధించి మొదటి బహుమతిని కైవసం చేసుకోగా, సేవాలాల్ యూత్ జట్టు రెండో బహుమతిని గెలుచుకుంది. యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు ఇలాంటి పోటీలు దోహదపడతాయని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బొండ్ల గంగ సాయిలు, కారోబార్ బొడ్డు రాజు, సీనియర్ బీఆర్ఎస్ పార్టీ నాయకుడు దాత్రిక మహిపాల్, గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

# మౌలిక సదుపాయాలు కల్పించాలి

## ప్రజావాణిలో చిన్నతడుగూరు గ్రామస్థుల వినతి

మద్నూర్, బతుకమ్మ :కామారెడ్డి జిల్లా మద్నూర్ మండల పరిధిలోని చిన్నతడుగూరు (ఖరగ్) గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ గ్రామస్థులు మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అధికారులకు ఫిర్యాదు సమర్పించారు. గ్రామంలో దీర్ఘకాలంగా వేధిస్తున్న సమస్యలను పరిష్కరించాలని వారు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. నూతన గ్రామ పంచాయతీ భవనం: గ్రామ ప్రజల పరిపాలనా అవసరాల కోసం, సత్వర సేవల కోసం నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని నిర్మించాలి. అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం: చిన్నారులకు, గర్భిణులకు మెరుగైన సేవలు అందించేందుకు అంగన్‌వాడీ కేంద్రానికి ప్రత్యేక భవనాన్ని ఏర్పాటు చేయాలి. ప్రభుత్వ పాఠశాలకు ఉపాధ్యాయుడి నియామకం: స్థానిక ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదని, తక్షణమే అవసరమైన ఉపాధ్యాయుడిని నియమించి విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలని కోరారు. గ్రామంలో విద్యా, పరిపాలనా సదుపాయాలను మెరుగుపరిచేందుకు సంబంధిత ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరపాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. తక్షణమే నిధులు మంజూరు చేసి భవన నిర్మాణ పనులు చేపట్టాలని, ఉపాధ్యాయుల కొరతను తీర్చాలని కోరారు. ఈ ప్రజా సమస్యల పరిష్కారం కోసం గ్రామస్థులతో కలిసి బండివార్ హనుమాన్లు ప్రజావాణిలో ఫిర్యాదు సమర్పించిన వారిలో ఉన్నారు. అధికారులు సానుకూలంగా స్పందించి తమ సమస్యలను పరిష్కరిస్తారని గ్రామ ప్రజలు ఆశాభావం వ్యక్తం చేశారు.

